క్లుప్తంగా

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కెరమెరి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం 14 మంది లబ్ధిదారులకు ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ దత్తుప్రసాద్, డీటీ సంతోష్‌కుమార్, ఎంపీటీసీ ఇష్తేకార్, నాయకులు ఉత్తం, యూనూస్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని హెచ్‌ఎం దుర్గయ్య అన్నారు. కాగజ్‌నగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కుంగ్ ఫూ, కరాటే ఓపెన్ చాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని బండల్‌హెట్టి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చడంతో వారిని అభినందించారు. పాఠశాలకు చెందిన జానిక, పావని, కాజల్, కరిష్మా, మల్లీశ్వరి, తమన్నా, సాక్షిలు పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు రమేశ్, మౌనిక, సౌజన్య, స్వాతి, అంజన్న, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కుమురం భీంకు ఘన నివాళి



భీంకు నివాళులర్పిస్తున్న దత్తు ప్రసాద్

కెరమెరి: మండలంలోని జోడేఘాట్‌లో గల కుమురం భీం విగ్రహానికి మంగళవారం తహసీల్దార్ దత్తు ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. తహసీల్దార్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా జోడేఘాట్‌ను సందర్శించారు. కుమురం భీం మ్యూజియాన్ని పరిశీలించారు. ఆయన వెంట డీటీ సంతోష్ ఉన్నారు.

ఘనంగా శివశంకర్ వర్ధంతి

ఆసిఫాబాద్‌అర్బన్: మాజీ కేంద్రమంత్రి, మాజీ గవర్నర్ పుంజాల శివశంకర్ వర్ధంతిని మంగళవారం జిల్లా కేంద్రంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శివశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మిట్ట వెంకన్న, సురేశ్, అడప సతీశ్, జక్కయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న పరమేశ్వరాలయం కమిటీ ఎన్నిక



ఆడె వేణు

రెబ్బెన: మండలంలోని నంబాలలో గల ప్రసన్న పరమేశ్వర ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆలయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా ఆడె వేణు, ఉపాధ్యక్షులుగా బక్క ఆనంద్, జి.శంకర్, ప్రధాన కార్యదర్శిగా పూదరి తిరుపతి, కోశాధికారిగా మాసాడి జగన్, కమిటీ సభ్యులుగా చెన్న సాయికుమార్, కొవ్వూరి శ్రీకాంత్, ఇంగు సాయి కుమార్, అంగల తిరుపతి, ఉప్పులేటి మల్లేష్, పుప్పాల కమలాకర్, ఇందూరి హరికృష్ణ, పెండ్యాల హరీష్, ఆకుల సాయికిరణ్‌గౌడ్, దెబ్బటి సాయి, పూదరి నరేష్, మారుమొకం సాయిలను ఎన్నుకున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చింతలమానెపల్లి: మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ డుబ్బుల నానయ్య అధ్యక్షతన మండల సమావేశం ఉంటుందన్నారు. సమావేశంలో మండలంలోని పలు అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు సమావేశానికి తమ శాఖల నివేదికలతో సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

సమస్యల్లో ‘కొత్తగూడ’

- కొన్ని నెలలుగా సరఫరా కాని నీరు
- అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలలు లేవు
- ఇబ్బందులు పడుతున్న ఆదివాసీలు



కొత్తగూడ గ్రామం

కెరమెరి: గిరిజన గూడెం సమస్యలతో సతమతమవుతోంది. ఏళ్లు గడుస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఆదివాసీలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో కెరమెరి గ్రామ పంచాయతీ పరిధి కొత్తగూడ గ్రామంలో కనీస సౌకర్యాలు లేక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గూడెంలో సమస్యలు తాండవిస్తున్నాయి.

పగిలిన మిషన్ భగీరథ పైపులు

కొత్తగూడ గ్రామస్తులంతా గోండు ఆదివాసీలు. 20 కుటుంబాలు, 108 మంది జనాభా ఉన్నారు. గ్రామానికి మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో గ్రామంలో ఉన్న ఒక్క చేతిపంపు పైనే వారు ఆధారపడుతున్నారు. వేసవి ఇంకా ప్రారంభం కాకముందే చేతిపంపు నుంచి నీరు సరిగా రావడం లేదు. ఒక్క బిందె నిండడానికి ఎంతో సమయం పడుతుంది. ఇక వేసవికాలంలో తాగడానికి నీరు కూడా ఉండదని స్థానికులు వాపోతున్నారు. గ్రామంలో మిషన్ భగీరథ నీరు కొద్ది నెలలుగా సరఫరా కావడం లేదని, రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా పైపులు పగిలి పోవడంతో నీటి సరఫరా నిలిచిపోయిందని ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన మంచినీటి పథకం నిరుపయోగంగా మారింది. గ్రామంలో మురికి నాలాలు లేక మురికి నీరంతా రోడ్లపైనే పారుతోంది. దీంతో దుర్వాసన వస్తుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

అలంకారప్రాయంగా పాఠశాల..

గ్రామంలో పాఠశాల భవనం ఉన్నప్పటికీ టీచర్ పోస్టు ఖాళీగా ఉండడంతో అలంకారప్రాయంగా మారింది. మరుగుదొడ్లున్నా నిరుపయోగంగా మారాయి. గ్రామంలో సుమారు 20 మంది వరకు ఐదేళ్ల లోపు చిన్నారులు ఉన్నారు. కానీ అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో ఇంటి వద్దే ఉంటున్నారు. గ్రామంలోని గర్భిణీలు, బాలింతలు సైతం ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలను టీచర్‌ను నియమించడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



గ్రామంలోని ఏకైక చేతిపంపు



నిరుపయోగంగా మంచినీటి ట్యాంక్

పైపులు సరి చేయాలి



మిషన్ భగీరథ పైపులు పగిలి చాలా రోజులవుతుంది. దీంతో గ్రామంలో నీటి సరఫరా కావడం లేదు. గ్రామంలో ఉన్న చేతిపంపు నుంచి నీరు రాని పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి భగీరథ నీరు వచ్చేలా చూడాలి.

– కోట్నాక్ వినాయక్‌రావు, గ్రామ పటేల్

అంగన్‌వాడీ కేంద్రం నిర్మించాలి



గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో చిన్నారులు ఇళ్ల వద్దే ఉంటున్నారు. గర్భిణీలు, బాలింతలు సైతం ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు టీచర్‌ను కేటాయించాలి. అధికారులు స్పందించాలి.

– సిడాం నీలాబాయి, గ్రామస్తురాలు

నిబంధనలు బేఖాతరు..!



కౌటాల ప్రధాన రహదారిపై అధిక లోడ్‌తో కంకర తీసుకెళ్తున్న లారీ

- ప్రాణాలు తీస్తున్న ఓవర్ లోడ్
- ఇసుక ట్రాక్టర్లు, కంకర టిప్పర్లతో ప్రమాదాలు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వాహనాల యజమానులు
- పట్టించుకోని అధికారులు

కౌటాల: జిల్లాలో కొన్ని వాహనాలు అతివేగంగా, అధిక లోడుతో ఇష్టారాజ్యంగా వెళ్తుండడంతో అమాయకుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. కంకర క్వారీ యజమానులు పొరుగు రాష్ట్రాలకు కంకర తరలించే క్రమంలో గ్రామీణ ప్రజలు టిప్పర్ల చక్రాల కింద నలిగిపోతున్నారు. విద్యుత్ గుత్తేదారులు సైతం సంపాదనే లక్ష్యంగా జాగ్రత్తలు పాటించకుండా వాహనాల్లో అధిక లోడుతో విద్యుత్ స్థంభాలు, సామగ్రి తరలిస్తుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ఓవర్ లోడ్‌తో..

కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల్లో నిత్యం ఓవర్ లోడ్‌తో భారీ వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. వీటిలో ఏ ఒక్క టిపర్, ట్రాక్టర్ కూడా రవాణా, మైనింగ్ శాఖ నిబంధనలు పాటించవు. 10 టైర్లు ఉన్న లారీ 20 టన్నులతో వెళ్లాల్సి ఉండగా 25 నుంచి 26 టన్నులు, 12 టైర్ల లారీ 26 టన్నులతో వెళ్లాల్సి ఉండగా సుమారు 32 టన్నులకు పైగానే ఓవర్ లోడ్‌తో వెళ్తున్నాయి. ఓవర్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ ఢీ కొని రెండేళ్ల క్రితం మండలంలోని యాపలగూడ గ్రామంలో నాలుగేళ్ల చిన్నారి మృత్యువాత పడింది. ట్రాక్టర్లలో సైతం ఎక్కువ టన్నులు లోడ్ తరలిస్తుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ట్రాక్టర్‌లో కేవలం 10 టన్నులను మాత్రమే తరలించాల్సి ఉండగా 15 నుంచి 17 టన్నుల వరకు లోడింగ్ చేస్తున్నారు. దీంతో వాహనాలు అదుపు తప్పి బోల్తా పడటమో, ఇతర వాహనాలను ఢీకొట్టడమో జరుగుతుంది.

గాలిలో ప్రాణాలు..

ముత్తంపేట శివారులోని కంకర క్రషర్ కంపెనీలు రాత్రి, పగలు తేడా లేకుండా అధిక లోడుతో టిప్పర్లలో కంకర తరలిస్తున్నారు. వాగులు, నదుల నుంచి అక్రమంగా ఓవర్ లోడుతో ఇసుక తరలిస్తున్న క్రమంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనలు చేస్తే కొంతమేర నష్టపరిహారం చెల్లించి యజమానులు చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాహనాల యజమానుల అత్యాశ, రవాణా శాఖ, మైనింగ్, ఇతర ప్రభుత్వ శాఖల నిర్లక్ష్యం.. వెరసి నిరుపేద కూలీలు, ప్రజల ప్రాణాలను హరిస్తున్నాయి.

జాడలేని తనిఖీలు..

వాహనాల రాకపోకలు, ఓవర్ లోడింగ్‌లను నిరంతరం పర్యవేక్షించాల్సిన రవాణా శాఖ, మైనింగ్, ఇతర సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ప్రమాదాలు జరిగినప్పుడు, బాధితులు ప్రాణాలు కోల్పోయాక నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తూ, జరిమానాలు విధిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కంకరను తరలించే భారీ వాహనాలు పరిమితికి మించిన లోడ్‌తో వెళ్తుంటే రూ. కోట్ల నిధులతో వేసిన ప్రధాన రహదారులు ఛిద్రమవుతున్నాయి. లారీ డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతూ ప్రాణాలు తీస్తున్న అధికారులు ‘మామూలు’గా తీసుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఓవర్‌లోడ్‌తో ప్రమాదకరంగా వెళ్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

‘కక్ష సాధింపు కోసమే రైస్ మిల్లుపై దాడులు’

సిర్పూర్(టి): కక్ష సాధింపు కోసమే తమ రైస్ మిల్లుపై దాడులు చేస్తున్నారని మిల్లు ఓనర్లు శివ కుమార్, మనీష్‌లు అన్నారు. మంగళవారం సిర్పూర్(టి)లోని ఆర్‌అండ్‌బీ గెస్టుహౌస్‌లో శ్రీ సాయి బాలాజీ రైస్ మిల్లు యజమాని విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ డీటీలు శ్రీనివాస్, రాజ్‌కుమార్‌లు తమను వేధిస్తున్నారని, కనీసం సమాచారం ఇవ్వకుండానే తాళాలు పగలగొట్టి మిల్లులో సోదాలు చేసినట్లు ఆరోపించారు. తమను డబ్బులు డిమాండ్ చేశారని, ఇవ్వనందుకే రైస్‌మిల్లుపై ఐదు రోజులుగా కక్ష సాధింపుతో దాడులు చేస్తున్నారన్నారు. దీనిపై హైకోర్టులో కేసు వేశామన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన కాంగ్రెస్ నాయకులు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

బెజ్జూర్: తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)ను సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు అర్షద్ హుస్సేన్, బసర్కార్ విశ్వనాథ్‌లు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు మెరుగవుతాయి



బొమ్మలతో కథలు చెబుతున్న సీఆర్పీ

రెబ్బెన: రూం టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ అందించిన కథల పుస్తకాలతో విద్యార్థుల్లో చదవడం, రాయడంలో నైపుణ్యాలు మెరుగవుతాయని లేతన్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రవి కుమార్ అన్నారు. మంగళవారం కథల పుస్తకాలను ఉపయోగించి సీఆర్పీ దేవేందర్ విద్యార్థులకు పఠన కృత్యాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సాయికృష్ణ, రూం టూ రీడ్ సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి

తాండూర్: బీజేపీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు కమిటీలను ఏర్పాటు చేయాలని బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ విస్తారక్ స్వామి కుమార్ అన్నారు. బీజేపీ తాండూర్ మండల అధ్యక్షుడు రామగౌని మహిధర్ గౌడ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల సమావేశంలో స్వామి కుమార్ పాల్గొన్నారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, అసెంబ్లీ విస్తారక్ తిరుపతి, సంతోష్, విజయ్‌కుమార్, చిరంజీవి, సుధీర్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతోనే భవిత బంగారుమయం

తాండూర్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పర్చుకుని, వాటిని సాధించేందుకు కష్టపడితేనే వారి భవిత బంగారుమయం అవుతుందని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని సురభి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ మల్లేశం, జిల్లా సెక్టోరల్ సిబ్బంది మూర్తి, తాండూర్, అచ్చలాపూర్, రేచిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, జయప్రకాష్, ప్రదీప్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న నాయకులు

బెజ్జూర్: మండలంలోని చిన్న సిద్దాపూర్ గ్రామంలో మురికి కాలువ నిర్మాణానికి మాజీ ఎంపీపీ కొండ్ర మనోహర్ గౌడ్, బీజేపీ మండల నాయకుడు పాల్వాయి శ్రావణ్ రావు, మెస్రం రాజారాంలు మంగళవారం భూమిపూజ చేశారు. కొబ్బరి కాయ కొట్టి పనులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం కింద రూ.5 లక్షలతో మంజూరైన మురికి కాలువ పనులను వారం రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. రమేశ్, భీంరావు, గోపాల్, శ్రీను, బక్కన్న, హనుమంత్, శంకర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులు పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

వాంకిడి: మండలంలోని ఇందాని గ్రామ పంచాయతీ పరిధిలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీవో వి.వి వరలక్ష్మి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన ప్రతీ ఒక్కరు పనులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఈజీఎస్ అధికారులకు సూచించారు. అనంతరం గ్రామ నర్సరీని సందర్శించి వర్షకాలం నాటికి మొక్కలు నాటేందుకు సిద్ధం చేయాలని సూచించారు. క్రమం తప్పకుండా మొక్కలకు నీరు పట్టాలని, టార్గెట్‌కు తగ్గకుండా మొక్కల రక్షణ చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీవో శ్రావణ్ కుమార్, గ్రామ కార్యదర్శి దినేష్, సీనియర్ మేట్ నవీన్, తదితరులు ఉన్నారు.

వేలం ద్వారా రూ.3.53 లక్షల ఆదాయం

రెబ్బెన: మహా శివరాత్రిని పురస్కరించుకుని రెబ్బెన మండలం నంబాలలోని ప్రసన్న పరమేశ్వర ఆలయంలో నిర్వహించనున్న జాతర సందర్భంగా మంగళవారం ఆలయ ప్రాంగణంలో వేలం నిర్వహించారు. వివిధ దుకాణాల నిర్వహణకు వేలం నిర్వహించగా.. ఆలయానికి రూ.3.53లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. జాతరలో కొబ్బరికాయల విక్రయం కోసం రూ.60,000, సైకిల్ స్టాండ్ నిర్వహణకు రూ.98,000, తైబజార్ నిర్వహణ కోసం రూ.1,00,000, లడ్డూప్రసాదాల విక్రయానికి రూ.55,000, సంవత్సర దుకాణం నిర్వహణకు రూ.40,000 ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

‘పల్స్ పోలియో’ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కెరమెరి: మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీహెచ్‌వో శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో అంగన్‌వాడీ, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 3552 గృహాల్లో 3981 మంది చిన్నారులు ఉన్నారని, వారికి పోలియో చుక్కలు వేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మీకాంత, ఫార్మసిస్ట్ ఖలీల్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు



కౌటాల: హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న అధ్యాపకులు

దహెగాం: ఇంటర్ ప్రథమ సంవత్సర వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీలో ఇంటర్ విద్యార్థులు ఉండగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రథమ సంవత్సరంలో 142 మంది, ద్వితీయ సంవత్సరంలో 128 మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సీఎస్, కళాశాల ప్రిన్సిపాల్ అమరేందర్ తెలిపారు.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కౌటాల: ఇంటర్ వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బాలకిషన్ రావు తెలిపారు. కౌటాలలోని జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో వేసిన హాల్ టికెట్ల నంబర్లను ఆయన మంగళవారం పరిశీలించారు. కౌటాల పరీక్ష కేంద్రంలో బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరంలో 376 మంది, గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 359 మంది పరీక్ష రాయనున్నట్లు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన షేక్ అఫ్రోజ్ (28 ఆత్మహత్య చేసుకున్నట్లు కాగజ్‌నగర్ పట్టణ ఎస్సై శంకరయ్య తెలిపారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అఫ్రోజ్‌కు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నా మరో యువతిని ప్రేమించాడు. ఆమె ప్రేమను నిరాకరించడంతో సోమవారం పురుగుల మందు తాగాడు. వెంటనే వైద్యం కోసం మంచిర్యాల ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

ఉట్నూర్‌రూరల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. ఎల్.విశాల్‌కు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.2 లక్షల ఎల్‌వోసీ పత్రాలను బాధిత కుటుంబానికి అందించారు.

పోస్టర్ ఆవిష్కరణ

తిర్యాణి: బెల్లంపెల్లి పట్టణంలో మార్చి 3వ తేదీన నిర్వహించే ఉమ్మడి జిల్లా బాడీ బిల్డింగ్ పోటీలకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం మండల కేంద్రంలో నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు లక్ష్మణ్ మాట్లాడుతూ పోటీల్లో ఉమ్మడి జిల్లాలోని బాడీ బిల్డర్స్ పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు జువ్వాజి అనిల్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్ ఉన్నారు.

ఘనంగా 24 కుండీల యజ్ఞం

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ గాయత్రీ పీఠంలో మంగళవారం 24 కుండీల యజ్ఞం ఘనంగా నిర్వహించారు. హరిద్వార్ పీఠం నుంచి గురువు రాంనాథ్ ఠాగూర్, హైదరాబాద్ గాయత్రీ పీఠం సభ్యులు రాజబాబు, శ్రీలత ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక గాయత్రీ పీఠ సభ్యులు చిట్యాల రవి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.



‘ఈకేవైసీ’ తిప్పలు

కెరమెరి మండలంలోని బాబేఝరి గ్రామానికి చెందిన రేషన్ లబ్ధిదారులు ఈకేవైసీ చేసుకునేందుకు తిప్పలు పడుతున్నారు. గ్రామంలో సిగ్నల్స్ రాకపోవడంతో మంగళవారం గ్రామస్తులు గుట్టలెక్కారు. సిగ్నల్ లేక గ్రామంలో ఆఫ్‌లైన్‌లోనే రేషన్ సరఫరా చేస్తున్నారు. అయితే కేవైసీ చేసుకునేందుకు ఈనెలాఖరుతో గడువు ముగుస్తుండడంతో డీలర్‌తో పాటు లబ్ధిదారులు గుట్టలెక్కి సిగ్నల్ ఉన్న చోట కేవైసీ చేసుకున్నారు. షాపులో 170 కార్డులు ఉండగా ఇప్పటివరకు 85 మంది లబ్ధిదారులు మాత్రమే ఈకేవైసీ చేసుకున్నారు. దీంతో గడువు పెంచాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

– కెరమెరి